# రెండు గెలుపుల ఓటమి

గాదె లక్ష్మీనరసమ్మ



**“ఏమండీ! మీరు రేపే వెళ్ళిపోవాలా?” అంది కుసుమ దీనంగా చూస్తూ.**

“అవును కుసుమా! ఏదో నాలుగు రోజులు శలవలు కలవబట్టి, యిన్ని రోజులుండగలిగేను గానీ, లేదంటే శుక్రవారం రాత్రి రావడం, ఆదివారం రాత్రి మళ్ళీ వెళ్ళిపోవడం మామూలేగా” అన్నాడు శ్రీధర్ నవ్వుతూ.

“ఎన్నాళ్లండి యిలా? ఈ ఉద్యోగాల మూలాన్న మీరక్కడ, నేనిక్కడ అవస్థలు పడుతూ, బ్రతకడమేనా? ఇద్దరం కష్టపడి సంపాదిస్తున్నా, మనశ్శాంతి కరువైపోతోంది” అంది బాధగా.

“అయితే యేం చేద్దామంటావ్? ఇద్దరం వుద్యోగాలు మానేసి కడుపు మీద తడిగుడ్డ పెట్టుకుని పడుకుందామా? చెప్పు?”

“అది కాదండీ, మీరు ఈ వూరికి బదిలీ చేయించుకోకూడదూ?”

“అదంత సులభమనుకుంటున్నావా? లంచం లేనిదే ఆఫీసుల్లో యే పనీ జరగడం లేదు గద! మనకంత సీను లేదే! కాకా పట్టడం మనకి చేతకాని విద్య!” అన్నాడు నిరుత్సాహంగా.

“అయితే జీవితమంతా యిలాగే మీరక్కడ, నేనిక్కడ వుండిపోతారూ?” అంది బేలగా.

“సరే! అయితే ఓ పని చెయ్యి. నువ్వు ఉద్యోగం మానేస్తే ప్రాబ్లం వుండదుగా! ఆ పని చేస్తావా?” అన్నాడు కవ్వింపుగా.

“అమ్మో! ఉద్యోగం దొరకడమే గగనమవుతున్న ఈ రోజుల్లో వున్న ఉద్యోగం వదులుకునేటంత తెలివి తక్కువదాన్ని కాను! ఇద్దరం సంపాదిస్తుంటేనే ఆమాత్రంగా వుంది సంసారం. అదీ మానేస్తే యిక ఆకాశం వంక చూడ్డమే గతి! అయితే ఓ పని చేస్తాను. నేను బరంపురంకి బదిలీ చేయమని అప్లై చేస్తాను. మీరు చేసినా నేను చేసినా ఒక్కటే గద! ఇద్దరం ఒకే దగ్గర వుండాలని కదా మన కోరిక! మీరూ బదిలీకి ప్రయత్నించండి. నేను కూడా రేపటినుంచి ఆ ప్రయత్నంలోనే వుంటాను.” అంది కుసుమ.

“సరేలే! ఎవరి ప్రయత్నం వాళ్ళం చేద్దాం. ఏ యిద్దరిలో ఒక్కరికైనా మంచిదే కదా, ఎంచక్కా కలసి ఒకే దగ్గర వుండవచ్చును. సరే యిక ఈ విషయం వదిలేయ్” అంటూ లేచాడు శ్రీధర్.

కుసుమ వంటరిగా వుద్యోగం చేస్తూ, అటు ఆఫీసు పని, యిటు యింట్లో ఆడ, మగ పనులన్నీ తానే వంటరిగా చేసుకుంటూ, రాత్రుళ్ళు భయంతో ఒంటరిగా బిక్కు బిక్కుమని పడుకుని ఈ విషయమే ఆలోచిస్తుండేది.

అక్కడ శ్రీధర్ ఆఫీసు పనితోబాటు, ఇంట్లో వంట పనులూ చేసుకుంటూ దినదిన గండం దీర్ఘాయుష్షు! అన్నట్టుగా రోజులు నెట్టుకొస్తున్నాడు. పాపం మొత్తానికి యిద్దరికి సుఖం ఆమడ దూరంలో వుంది.

శ్రీధర్ తన మనస్సుని చంపుకుని ఆఫీసర్‌ని మంచి చేసుకుని, తన యిబ్బందులన్నీ యేకరువు పెట్టి, తన భార్య వుంటున్న వూరికి బదిలీ చేయించమని ప్రాధేయ

పడసాగాడు. తన ఆరోగ్యం కూడా సరిగ్గా లేదని ఎలాగైనా బదిలీ సంగతి చూడమని పదేపదే చెప్పసాగాడు.

ఇక్కడ కుసుమ కూడా ఆఫీసర్‌తో తన వంటరి జీవితం, యిబ్బందులు చెప్పి, తన బదిలీకి రికమెండ్ చేయమని కోరింది. అలాగేనని వేకెన్సీలుంటే తప్పక చూస్తానని హామీ యిచ్చేడు.

శ్రీధర్ ప్రతీవారం వచ్చి వెళుతున్నాడు. ఇద్దరూ ఎవరి ప్రయత్నాలు వాళ్ళు చెప్పుకుంటూ సంతృప్తి పడుతున్నారు.

* * *

"కంగ్రాచ్యులేషన్స్ కుసుమా! మన ప్రయత్నం ఫలించింది. నీకు మీ వారి వూరికి బదిలీ అయింది. ఇక నీ కష్టాలు తీరేయి. ఇదిగో నీకు బరంపురం బదిలీ చేస్తున్న ఆర్డర్!!! బెస్ట ఆఫ్ లక్!" అన్నాడు నవ్వుతూ ఆఫీసర్.

తన చెవులను తానే నమ్మ లేకపోయింది కుసుమ! కలో నిజమో తెలియని అయోమయంలో పడింది. వెంటనే తెలివి తెచ్చుకుని, ఆఫీసర్‌కి నమస్కారం పెడుతూ, "చాలా థేంక్స్ సార్! మీ ఋణం తీర్చలేనిది సార్! మా దంపతుల్ని దయతో కలిపి పుణ్యం కట్టుకున్నారు" అంది ఆనందంగా చేతులు జోడిస్తూ.

"విష్ యూ బెస్ట్ ఆఫ్ లక్" అంటూ నవ్వుతూ ఆర్డర్ అందించేడు ఆఫీసర్.

శ్రీధర్‌కి ఈ విషయం వెంటనే ఫోన్ చేద్దామనుకుంది కానీ ఆరోజే శుక్రవారం! ఆ రాత్రే వస్తాడు గనక సర్‌ప్రయిజ్ చేద్దామని నవ్వుకుంటూ కామ్‌గా వూరుకుంది. రాగానే వూరించి వూరించి ఈ కబురు చెప్పి థ్రిల్ చేయాలి! ఏ విధంగా చెప్పాలా అని ఆలోచిస్తూ గడిపేసింది.

"కుసుమా! ముందు నోరు తెరువు" అంటూ స్వీట్ కుక్కి నవ్వుతూ నిలబడ్డాడు చిద్విలాసంగా. అతని ముఖం ఆనందంతో వెలిగిపోతోంది. కుసుమకి అర్థం కాలేదు. నవ్వుతూ స్వీట్ నమలసాగింది.

"నీకోసం బ్రహ్మాండమైన అమోఘమైన, సంతోషదాయకమైన వార్త తెచ్చేను కాచుకో" అంటూ వూరించసాగేడు.

"ఏమిటీ! సస్పెన్సులో పెట్టక వేగం చెప్పే, మీకు అంతకన్నా వందరెట్లు స్వీట్ న్యూస్ చెప్తాను." అంది నవ్వుతూ.

"అయితే కళ్ళు మూసుకో" అంటూ తన ట్రాన్స్‌ఫర్ కాగితాన్ని ఆమె ముఖం ముందు పెట్టి యిక కళ్ళు తెరిచి చదువుకో" అన్నాడు నవ్వుతూ. ప్రమోషన్ మీద శ్రీధర్‌కి, భువనేశ్వర్ బదిలీ అయిన ఆర్డర్ అది!!!

కుసుమకి కళ్ళు బైర్లు కమ్మేయి. అంతా గాఢాంధకారంలో కనబడుతోంది. ముఖంలో కత్తి వేటుకి నెత్తురు చుక్కలేదు. ముఖం పాలిపోయింది. మిడిగుడ్లు వేసుకుని ఆ కాగితం వైపు ఆలా పిచ్చిదానిలా చూస్తుండిపోయింది.

తనను ఆనందంతో ముంచెత్తుతుందనుకున్న కుసుమ అలా నిర్లిప్తంగా చేష్టలుడిగి బొమ్మలా వుండిపోవడంతో శ్రీధర్‌కి ఆశ్చర్యం వేసింది. ఆ ఆర్డర్ చదివి గంతేస్తుందనుకున్న కుసుమ యిలా వుందేమిటీ! అనుకున్నాడు.

"అరె! ఏమయింది కుసుమా! ఇంత మంచి వార్త తెస్తే అలా వున్నావేమిటి? ఒంట్లో బాగా లేదా? నీకు సంతోషంగా లేదా? నేనయితే యింత ఆనందాన్ని పట్టలేకపోతున్నాననుకో! నీవిలా డీలా పడిపోయావేమిటి!" అన్నంతలో కుసుమ మెల్లగా లేచి ఓపిక తెచ్చుకుని తన బదిలీ ఆర్డర్‌ని శ్రీధర్ చేతిలో పెట్టింది కళ్ళ నీళ్ళతో!

కుసుమని బరంపురంకి బదిలీ అయినట్టుగా వున్న ఆ ఆర్డర్ చదివి కొయ్యబారిపోయాడు శ్రీధర్!!! అరె ఇదేమి అన్యాయం, తను అతి కష్టం మీద యిక్కడకు బదిలీ చేయించుకుంటే, కుసుమకి ఇక్కడ నుండి తనుండే చోటుకి బదిలీనా? ఏమిటీ వ్రాత? మళ్ళీ మాకు ఎడబాటేనా??? మాకీ యెడబాటు మరి తప్పదా భగవాన్!! ఏమిటి నీ లీలలు!!!

"ఇది నిజమా కుసుమా? కాదని చెప్పు" అంటూ అక్కడే చతికిలబడిపోయాడు నీరసంగా! కుసుమ ఏకధారగా ఏడుస్తోంది పాపం! తననెలా ఊరుకోబెట్టాలో తెలియక కొట్టుమిట్టాడుతున్నాడు శ్రీధర్.

"కుసుమా! జీవితంలో మనకీ యెడబాటు యెప్పటికీ తప్పదేమో" నంటున్న శ్రీధర్‌ని కళ్ళనీళ్ళతో అలా చూస్తుండిపోయింది కుసుమ!

ఇద్దరూ అలా అచేతనంగా యెంతసేపు వున్నారో మరి!!! *

## ఘనంగా 'కాస్మో' అవార్డుల ప్రధానం

చెన్నై నగరంలోని అన్నాసాలైలో గల కాస్మోపాలిటన్ క్లబ్ ఆధ్వర్యంలో, క్లబ్ ఆవరణలో తెలుగు ఉగాది, తమిళ నూతన సంవత్సరాది వేడుకలను, కాస్మో అవార్డుల ప్రధానోత్సవం ఇటీవల సంయుక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చొక్కలింగం ముఖ్య అతిథిగా పాల్గొని ఈ ఏడాది కాస్మో అవార్డులను ముగ్గురు ప్రముఖులకు అందజేసారు.



ఎడమ నుంచి కుడికి : ***శ్రీయుతులు హరినారాయణ (కాస్మో పాలిటన్ క్లబ్ జాయింట్ సెక్రటరి) జె. కామ్దార్ (కోశాధికారి), కె. గజపతి (కాస్మో పాలిటన్ క్లబ్ గౌరవ కార్యదర్శి), జోష్న చిన్నప్ప (స్క్వాష్ చాంపియన్), డాక్టర్ తారా శ్రీనివాసన్ (ప్రముఖ సైకియాట్రిస్ట్), ఎస్.పి. ముత్తురామన్ (ప్రముఖ చలనచిత్ర దర్శకుడు), జస్టిస్ చొక్కలింగం (ముఖ్య అతిథి), ఎమ్. అణ్ణామలై (క్లబ్ అధ్యక్షుడు), ఆర్. సత్య నారాయణ (కాస్మో పాలిటన్ క్లబ్ ఉపాధ్యక్షుడు), జస్టిస్ టి.ఎన్. వళ్ళినాయగం (మాజీ కార్ణటక హైకోర్టు న్యాయమూర్తి)***